

# ఆడదాని కథ

"అమ్మోయ్! నీకు ఆకాశవాణి నుంచి పిలుపొచ్చింది" అంటూ ఓ కవరు విసిరింది మా అమ్మాయి.

నా గుండె గుభేల్మంది.

బహూశా "నిన్ను చంపబోయే వాడు మీ చెల్లి కడుపున పుడతాడు" అన్న ఆకాశవాణికూ్కడా కంసుడు అంత భయపడి ఉండడు.

పిల్ల పుట్టాలంటే తొమ్మిది నెలలు చాలు. కాని నా కథలు మాత్రం బుర్రలో అలా కొన్ని సంవత్సరాలుంటాయి. ఈ మధ్యలో బుర్రకి సిజేరియన్ చేసినా, బుర్ర పగుల్తుందే తప్ప కథ బయటకి

రాదు. కొన్నాళ్ళపాటు నా కథలు కేవలం ప్రత్యేక సంచికల్లోనే వచ్చేవి. కారణం ఏమిటంటే ఈ ఏడాది ప్రత్యేక సంచికకి కథ రాయడం మొదలుపెడితే, అది వచ్చే ఏటికి పూర్తి అయ్యేది. మళ్ళీ ఆ వచ్చే ఏటి కథ మొదలు పెడితేఅది ఆ పై ఏటికిఅందేది,ఈవేళ టైముకి వచ్చిన రైలు నిన్నటిది అన్న జోక్ లాగ.

రావలసిన టైముకి రాకుండా హార్ట్ ఎటాక్నైనా ఆపుకోవచ్చు నేమోగాని, రేడియో వాళ్ళకి మాత్రం టైముకి కథ రాయడం తప్పించుకోలేం. ఆలోచించినకొద్దీ బి.పి. పెరిగిందే తప్ప ప్లాటు తట్ట లేదు. కథకి ప్లాట్ సంపాదించడం కంటే, హైదరాబాద్ లో ప్లాట్ సంపాదించడం సులువనిపించింది. ఏం చెయ్యాలో తోచక 'కథలు రాయడం ఎలా?' అన్న పుస్తకం లైబ్రరీనుంచి తెప్పించి చదివేను. అందులో వ్యాసాలన్నీ ప్రఖ్యాత రచయితలు రాసినవే. అవన్నీ చదివేక కథకి ప్లాట్ మాటెలా ఉన్నా, భయం పట్టుకుంది,ఇంతవరకు నేను రాసినవన్నీ కథలేనా అని.

ఏ ఇద్దరు రచయితలూ ఏకీభవించరన్నది కేవలం సామెతే! కారణం ఏమంటే ఈ ప్రఖ్యాత రచయితలందరూ కూడ బలుక్కున్నట్టు కథకి శిల్పం ఉండాలి అని నిశ్చయించేశారు. అయితే ఆ శిల్పం ముక్కెంత పొడవుండాలో, మూతి ఎంత వెడల్పుండాలో మాత్రం ఎవరూ చెప్పలేదు.

ఇంతకీ విత్ ఆర్ విదౌట్ శిల్పం ఇప్పుడు కథ రాయక తప్పదు. మన దగ్గర లేనప్పుడు పక్కవాడిని అప్పో, అరువో అడగొచ్చు, ఒక్క పెళ్ళాం మినహా. మరం చేత అవమానం అనుకోకుండా నేను మా పిల్లలందర్నీ అడిగే సేను- "ఏదైనా ప్లాట్ చెప్పండర్రా" అని.

"చక్కటి ఇంగ్లీష్ డిటెక్టివ్ కథ ఒకటి తెనిగించు" అన్నారు నా కూతుళ్ళు, 'ఎలిస్టర్ మేక్లీన్' లోంచి ఒకరు, 'ఛేజ్' లోంచి ఒకరు బుర్ర పైకిపెట్టి.

"బ్రహ్మాండమైన క్రికెట్ కథ రాయి" అన్నారు నా సుపుత్రులు బేట్లు ఊపుకుంటూ.

మొదటిది నా కిష్టం లేదు. రెండోది నాకు తెలీదు. మరంచేత "అన్యథా శరణం నాస్తి" అని మా వార్ని పట్టుకున్నాను- మార్కండేయుడు శివుడ్ని పట్టుకున్నట్టు.

అయితే మార్కండేయుడికీ, నాకూ భక్తి ఒక్కటే తేడా.

"కథా?" అన్నారు మావారు "ఖూనీనా" అన్నంత ఆశ్చర్యంగా.

"ఔను-కథే" అన్నాను.

"హుం" అన్నారు తనే.

నేనేం అనలేదు.

"నేను కథ చెప్తే నువ్వు క్రెడిట్ కొట్టేస్తావా?" అన్నారు తన అప్తి నేనేదో అన్యాయంగా అనుభవించేస్తున్నట్టు.

"సరిగ్గా అమాటే అంటున్నారు అందరూ. వచ్చిన నింద ఎలాగా వచ్చింది. మరింక అనవసరంగా నేనెందుకు కష్టపడాలి?" అన్నాను.

"నువ్వు అసలు స్త్రీ జాతికే తీరని అవమానం" అన్నారు.

అయితే అయ్యేను కాని కథ చెప్పమన్నాను.

"ప్రస్తుతం దేశంలో సారస్వత లోకాన్ని ఎవరేలుతున్నారు?

స్త్రీలు.

"సినీమా ప్రపంచాన్ని ఎవరుద్ధరిస్తున్నారు?

స్త్రీలే.

ఎవార్డు లెవరివి?

యింకెవరివి? ఆడవాళ్ళవే.

వారపత్రికల మహారాజ పోషకు లెవరు?

వనితలే

మాసపత్రికల రాజ పోషకు లెవరు?

మగువలు.

అలాంటి స్త్రీజాతిలో పుట్టి ఆఫ్టరాల్ ఒక కథ రాయలేక పోతున్నావంటే...."

"కథ చెప్పండి" అన్నాను కన్నంపడ్డ రికార్డులాగా.

"దసరా మామూలు వాళ్ళలా, ఎల్.ఐ.సి. ఏజెంటులా పట్టుకుంటే వదలవు. ఖర్మ....సరే, రాసుకో.. ఓ ఖరీదైన కుర్రాడుంటాడు. వాడోనాడు ఏదో పుస్తకంలో పల్లెటూళ్ళే భారతదేశపు వెన్నెముక అని చదివినవాడై, ఆ ఎముకలెలా ఉంటాయో చూడాలన్న కోరికతో, తన ఖరీదైన కార్లో పక్కనేవున్న పళ్ళెల్లెటూ వెళ్తాడు...."

"ఏం పాపం! ఆ కుర్రాడికి చదువు, ఉద్యోగం వగైరాలేం లేవా?" డౌటు వచ్చింది నాకు.

"ఛీ-ఛీ. కాళిదాసు కూడా మూడ్ పాడుచేసేస్తావు. కథకి అడ్డు రాకుండా చెప్పింది విను... వెళ్ళి ఆ తరవాత ఏం చెయ్యాలో తోచక కాలక్షేపానికి క్లోజప్పులో ఒక పల్లెపడుచుని ప్రేమించి, లాంగ్ షాట్‌లో వెళ్ళిపోతాడు. ఆ అమ్మాయి నెల తిరక్కుండానే నెలతప్పి, ఆ మాజీ ప్రియుడ్ని వెతుక్కుంటూ పట్నం వెళ్తుంది. వాడెక్కడా దొరకడు. ఆ

అమ్మాయి "ఛీ- ముష్టి మొగాళ్ళు" అని తిడుతుంది. మరింక ఏం తట్టాలో తోచక, కసి కొద్దీ కాల్ గర్ల్ అయిపోతుంది...."

ఒళ్ళు మండి పోయింది నాకు. యిది కథా? సినీమానా?

"సర్వ కథలూ సినీమా గచ్ఛంతి" అన్నారు ఆయనే. ఆయన చిన్నప్పుడు హైస్కూల్లో సంస్కృతం చదివేడు, పెద్దయ్యాక వేదాలన్నీ వెనకనించి నవిలేద్దా వని. ఫలితంగా యిటు సంస్కృతమూ రాలేదు, అటు తెలుగూ అబ్బలేదు.

"అంచేత పెన్నుని ఎప్పుడూ సినీమాకే గురిపెట్టు. ఏ తల మాసిన వాడో తియ్యకా పోడు. అనక వాడికి గుండు అయిపోకా తప్పదు. అఫ్‌కోర్స్-ఎవరి తల రాత ఎవరు రాస్తారో చెప్పలేం అనుకో...అన్నట్టు యీలోగా ఆ హీరోయిన్‌కి ఓ కూతురు పుడుతుంది. నాకు కోర్టుకి టైమై పోయింది. మరంచేత యింత వరకు మసాలా కలిపి రాయి. ఆ కూతురు గుంటనేం చెయ్యాలో సాయంకాలం ఆలోచిద్దాం" అంటూ లేచి వెళ్ళిపోయేరు.

"నా పెన్నేదర్రా?" మా వారి మీద కోపం ఆ కేకే చెప్తుంది.

"చిన్ని పట్టుకెళ్ళాడు" అంది చిన్నది.

"మరి వాడిదేమైంది?"

"పార్వతి దగ్గరుంది."

"దాని?"

"నేను వాడుతున్నాను."

"మరి నీది?"

"పోయింది."

యీ పేదరాశి పెద్దమ్మ కథకి పిచ్చెక్కి పోయింది.

"ఏదో ఒకటి యిలా తగలెయ్యి!" అరిచేను.

తగలేసింది.

యీ పూటెలాగైనా సరే కథ రాస్తేకాని కదలదల్చుకోలేదు. మంచం మీద మఠం వేసు కూర్చున్నాను. పెన్ను మూత తియ్యడం, నా చీర, తెల్ల కాయి తాలు సిరాతో స్నానం చెయ్యడం, నేను పెన్ను విసరడం-అన్నీ అర క్షణంలో జరిగేయి.

"ఛ త్తెరి! వెధవ దరిద్రం. ఎన్ని పెన్నులు కొన్నా సంతకం పెడదామంటే పెన్నుండదు. మళ్ళీ యింట్లో అందరూ స్టూడెంట్లే. యింకీ ఇల్లు బాగుపడదు. పెన్నుని కూడా పెట్లో పెట్టి ఎంతకని దాచు కుంటాం?" నా సణుగుడు పూర్తి కాకుండానే— "అంట్లెయ్యండి, పొద్దెక్కి పోనాది" అంటూ అమ్మ

వారిలా ఎదురుగా నిలుచుంది పని మనిషి.

కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ అయినా బతిమాలితే కాస్సేపు ఆగుతుందేమో కాని, మా పనిమనిషి మాత్రం అర నిమిషం ఆగదు. అంట్లు దానికి, పెన్ను మా చిన్న దానికి పడేసి మళ్ళీ మంచం ఎక్కాను. ఇల్లంతా వెతగ్గా వెతగ్గా దొరికిన ఓ పెన్సిలు ముక్క పట్టుకొని. అసలా అరంగుళం పెన్సిలు దొరక్కపోతే, ఈ వేళ మసి బొగ్గుతో నైనా సరే రాసెయ్యాలన్నంత ఉక్రోషంగా ఉంది. రాసేద్దును కూడా.

యింతలో...

"పాలకు డబ్బులు..." ఎదురుగా జెండా కర్రలా నిల్చున్నాడు జవాను.

ప్రపంచం తిరగబడిపోయినా సరే, ఒక అరగంట వరకూ ఆగమన్నాను.

ప్రపంచం సంగతి తనకి తెలీదట. కాని పాలవేను మాత్రం వచ్చేసిందట. ఆగడానికి తనకేం అభ్యంతరం లేదట, పాలవేను వెళ్ళిపోకుండా వుంటే.

అమ్మ బాబోయ్! పాలుగాని దొరక్కపోతే సాయంత్రం కాఫీ ఉండదు. రేపు మజ్జిగ ఉండదు. పోనీ హోటలునుంచి మజ్జిగ తెచ్చుకుందామంటే ఆ హోటలవాడు గ్లాసుడు తెల్లనీళ్ళు రూపాయికి అమ్ముతాడు. యింతకీ రేపటివరకు బతికి బావుంటే మజ్జిగ సంగతి, అసలీ పూట కాఫీ లేకపోతే యింట్లో అందరూ వెర్రికుక్కల్లా కరిచేస్తారు.

"పద" అని లేచి మొల తడువుకున్నాను.

తాళాలేవీ?

పరుపులకింద, తలగడలకింద, పిల్లల జేబులు, మా లల్లూ ఆట సామాన్లు అన్నీ వెతికేను. అందరి ఇళ్ళ సంగతి నాకు తెలీదు కాని, మా యింట్లో మాత్రం తాళాల వేటకి సగం జీవితం అయిపోతుంది. ఒక్క తాళాలేకాదు- ఏ వస్తువూ పెట్టినచోట ఉండదు, ఏదీ అవసరానికి కనిపించదు మనుష్యుల్తో సహా. తాళాలకోసం వెతికితే తువ్వాలు దొరుకుతుంది. తువ్వాలు కోసం వెతికితే జాకెట్ దొరుకుతుంది.

"ఇది ఇల్లా? మాయల మరాఠీ సంసారమా?" అని మా వారు అస్తమానం సణుగుతూనే వుంటారు. అయినా మా ఇంట్లో ఏదో ఒక దానికోసం నిర్విరామ వేట సాగుతూనే ఉంటుంది.

ఇంతకీ యిప్పుడీ తాళాలు

దొరుకుతే తప్ప నా కథ నడవదు.

"ఒరే అరుణా! నా తాళాలు కనిపించేయిరా?" అడిగేను.

వాడు వాళ్ళ నాన్నకి అక్షరాలా కొడుకు. అంచేత అడిగినదానికి సమాధానం చెప్పలేదు సరికదా- "అంటే నీక్కోపం కాని అమ్మ, నీ తాళాలకొక ప్లేస్ లేదు. ఎక్కడ చూసినా అవే. మేకునో, మొలనో పెట్టుకోకూడదూ యిలా అస్తమానం మమ్మల్ని చంపకపోతే" అని నా అశ్రద్ధ గురించి అరగంట లెక్చరిచ్చేడు.

యిాలోగా ఏఁవిఁటా కేకలు? భూకంపం వస్తోందా? ప్రళయం వస్తోందా? అదేం కాదట.

నా కూతుళ్ళిద్దరూ బాత్రూమ్ లోంచి ఒకరు, బైటనుంచి ఒకరు ఖూనీలై పోతున్నారు.

"తువాలు మర్చిపోయేనయి మ్మ ం టు ం ది" లోపలున్న చిన్నది.

"అసలింతసేపు బాత్రూమ్‌లో కాపురం చేస్తే మిగిలిన వాళ్ళేవైఁ పోవాలి? నాన్నని నీ ఒక్కర్తెకు స్పెషల్ బాత్రూమ్ కట్టించమను" అంటుంది పైనున్న పెద్దది-తువ్వాలు


## రచయితలకు మనవి

'విజయ' లో ప్రచురణార్థం పంపే కథలు, నవలలు, కార్టూన్స్, జోక్స్, వ్యాసాలు—ఏవైనా సరే ప్రచురణార్హం కాని వాటిని త్రిప్పి పంపగోరువారు, తగినంత పోస్టేజీ అంటించిన కవర్లను జత చేయవలసిందిగా కోరుతున్నాం. అప్పుడే నిరాకరించిన వాటిని త్రిప్పి పంపటం జరుగుతుంది. ఆ తర్వాత ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి ప్రయోజనముండదు. 'బాపు అభిమానుల పేజీ' లో పాల్గొనే పాఠకులు, తమ సంభాషణలను కార్డుమీద వ్రాసి పంపితే చాలు.

—ఎడిటర్

రచనలు పంపవలసిన చిరునామా:

ఎడిటర్

'విజయ'

80- ధనలక్ష్మికాలనీ, మద్రాసు-600 026.

యిస్తాను, యివ్వను అనకుండా. నిజం ఏవిఁటంటే దానికి తువాలు వెదకడం బద్దకం. చిన్నప్పుడు చెయ్యి కడుక్కోవడం బద్ధకంవేసి అన్నంతినడం మానేసేది అది.

"వెధవగోల. యిది ఇల్లా? జిన్నాటవరు సెంటరా? ఏఁవిఁటా కేకలు? ఆడపిల్లలు కారూ? తాళాలు దొరక్క నేను చస్తూవుంటే యీ ఈక్క జెట్టీలేఁవిఁటి?" అవి యిద్దర్నీ జెమిలిగా నాలుగు తిట్టి తువాలు దాసికి, మరో నాలుగు చీవాట్లు దీనికీ యిచ్చి, మళ్ళీ తాళాలవేట కంటిన్యూ చేశాను.

యీలోగా "ఏవిఁటమ్మా వెతుకుతున్నావు?" అన్నాడు అక్కడే ఉన్న ఒల్లూ.

బల్లితోక అయినా కాస్సేపు వదుల్తుందేమో కాని వాడుమాత్రం నన్ను వదలడు.

"తాళాల్రా నాన్నా!" అన్నాను.

"యిలా...యిలా...గుండ్రంగా ఉంటాయే...నువ్వు బీరువా తీస్తావే...అవా?" అన్నాడు వాడు చేతుల్తో అభినయిస్తూ.

"అవే. నీకు కనిపించాయిరా తల్లీ?" అడిగేడు చిన్ని.

తల గుండ్రంగా తిప్పేడు.

"ఎక్కడ?"

"అవీ... అవీ... నేను... నేను మేడమీంచి కింద విసిరేసేనుకదా?"

చంటివెధవ కాబట్టి ఊరుకున్నాను కాని, చాచి లెంపకాయ కొట్టాలనిపించింది.

పాలసీమ అయిపోయేక మళ్ళీ మంచం ఎక్కాను. ఈ సారి దేవుడొచ్చినా దిగదల్చుకోలేదు.

దేవుఁడు రాలేదుకాని కోర్టు నుంచి జవాను వచ్చాడు యమదూతలా. యమదూతకి చేతిలో పాశం ఉంటుంది. వీడి చేతిలో ఫ్లాస్కుంది.

"అయ్యగారు అర్జంటుగా నాలుగు కాఫీ పంపమన్నారు"ట.

పంపమంటారు. ఎందుకు పంపమనరూ? పంపించేవాళ్ళుంటే ఫ్లాస్కుతో కాఫీ ఏం ఖర్మ? బిందెల్తో బీరు పంపమంటారు.

ఆ మనిషి అంతే!

"ఛీ- ఛీ! అలాంటి మొగుడు, యిలాంటి పిల్లలు వున్న నాలాంటి వాళ్ళు కథ రాయాలనుకోవడం మహా పాపం" అనుకొని గట్టిగా లెంపలేసుకొని మంచం దిగేసేను. *

Published by K. Rajendra Babu, 80- Dhanalaxmi Colony, Madras 600 026, Printed by Vijaya Bapineedu at Vijaya Graphics; 210- Arcot Road. Madras-600 026. Phone: 422233
Editor: VIJAYA BAPINEEDU

★